సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయ నిర్మల బుధవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని కలిశారు. వివిధ సమస్యలను వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆమెతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్, పీహెచ్ఎన్ రాములమ్మ, హెచ్ఎస్ రవి కుమార్, స్వరూప, రజిత, యామిని, పాపమ్మ, ఎంపీహెచ్ఏ రోహిణి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని పాపమ్మ బస్తీలో నివసించే మల్లయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను పేట్ బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్ మన్యం ప్రాంతానికి చెందిన నారాయణరావు(31) కొంపల్లిలోని మల్లన్న కాలనీలో ఉంటూ వెల్డర్‌గా పని స్తున్నాడు. ఈ నెల 16న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో మల్లన్న కాలనీలో గోదావరి ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్ వద్ద మద్యం మత్తులో నారాయణరావుతో కండ్లకోయకు చెందిన అనీల్‌కుమార్, పవన్‌కుమార్ గొడవపడ్డారు. నారాయణరావుపై విచక్షణ రహితంగా రాళ్లతో దాడి చేయడంతో అతను తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా.. పరిస్థితి విషమించడంతో ఈ నెల 27 రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుడి అదృశ్యం

సుభాష్‌నగర్: వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పులివెందులకు చెందిన రామిరెడ్డి (70) పది రోజుల క్రితం సూరారం వైష్ణవినగర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. ఈ నెల 27న ఉదయం 7 గంటలకు వాకింగ్ వెళ్లిన అతను ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. వృద్ధుడి అల్లుడు మనోహర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ కరోనా అలర్ట్ !

- భయం వద్దు, జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- నియోజకవర్గంలో తొలి కేసు నమోదు

బాలానగర్: కరోనా కలవరం మళ్లీ మొదలైంది. గతంలో కరోనా సృష్టించిన భయానక వాతావరణంతో ప్రజలు కరోనా అంటేనే కలవరపడుతున్నారు. మారుతున్న వాతావరణం, పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్క్‌లు ధరించాలని, లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వ్యక్తులు, దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, షుగర్ పేషెంట్స్ కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

తొలి కేసు నమోదు

రాష్ట్రంలో కరోనా తొలి కేసు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్‌లో ప్రముఖ పల్మనాలజిస్టుకు కరోనా వైరస్ సోకడంతో ఐదు రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉన్నారు. మిగతా కుటుంబ సభ్యులకు ఎవరికీ వైరస్ లక్షణాలు సోకలేదు.



బాలానగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పరిసరాల కాలనీ నుంచి ఎక్కువగా విదేశాలకు వెళ్లటం, విదేశాల నుంచి ఇక్కడకు రాకపోకలు సాగుతుంటాయి. దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండటంతో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

జలుబు, దగ్గు ఉంటే జాగ్రత్త

జలుబు, దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంత వైద్యంతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని చెబుతున్నారు. మందులుతో పోయేది ఆక్సిజన్ సిలిండర్ వరకు తెచ్చుకోవద్దని కోరుతున్నారు. ఆరోగ్య పరమైన జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలి. జలుబే కదా అని తేలికగా తీసుకోవద్దు. మాస్క్ ధరించడం, శానిటేషన్ వాడాలి. జనసమూహాల్లోకి వెళ్లేటప్పుడు తప్పక మాస్క్ ధరించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



మాస్క్‌లు ధరించాలి. చేతులు శానిటైజేషన్ చేసుకోవాలి. గొంతునొప్పి, ముక్కు కారడం, ఒళ్లునొప్పులు, జ్వరం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యులు సూచనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. భయపడాల్సినంత అవసరం లేదు. కానీ జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ విజయనిర్మల, డిప్యూటీ సివిల్ సర్జన్, బాలానగర్

వీధి వ్యాపారులను ఆదుకోవాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాంతారావు



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాధవరం కాంతారావు, నాయకులు

కూకట్‌పల్లి: వీధి వ్యాపారులను ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కోరారు. ఈ మేరకు బుధవారం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌తో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసాపేట కూడలి నుంచి ఆంజనేయ నగర్ వెళ్లే దారిలో రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు దుకాణాలను తొలగించారన్నారు. 30 ఏళ్లుగా రోడ్డు పక్కనే 8 మంది దుకాణదారులు వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఈ దుకాణాలను గతంలో బండారు దత్తాత్రేయ ఎంపీగా, ఎమ్మెల్యే పీజేఆర్ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో దుకాణ సముదాయాలను నిర్మించారని వివరించారు. ఎంతో కాలంగా వ్యాపారం చేసుకుంటు జీవిస్తున్న వారిని అధికారులు ఎటువంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా తొలగించి ఆస్తి నష్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ తరువాత మిగులుతున్న రోడ్డు పక్కనే ఉన్న 20 అడుగుల స్థలాన్ని బాధిత దుకాణదారులకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బీజేపీ నాయకులు వినోద్, మల్లేష్, శైలేష్, నర్సింగ్, కృష్ణ, సోమశేఖర్, భగవంత్, గోపి, రాము, సత్యనారాయణ, కిషోర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే కాంగ్రెస్ విమర్శలు

నిజాంపేట్: బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకనే కాంగ్రెస్ విమర్శలు చేస్తుందని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు అన్నారు. బుధవారం బాచుపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జైహింద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న సీఎం, ఇతర కాంగ్రెస్ నాయకులను స్వాగతిస్తున్నామన్నారు. కానీ గతంలో ఇదే మల్కాజగిరి పార్లమెంట్ ఎంపీగా ఉన్న ముఖ్యమంత్రి ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఏ ఒక్కసారి కూడా కార్పొరేషన్‌కు వచ్చిన దాఖలాలు లేవన్నారు.

మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

మోతీనగర్ : మూసాపేట డివిజన్ పరిధిలోని మోతీ నగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించారు. వివిధ కేటగిరీల నుంచి 9 మంది గెలుపొందారని ఎన్నికల అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఎస్సీ కేటగిరి నుంచి కంచర్ల శ్రీనివాసరావు, మహిళల కేటగిరి నుంచి పి సుధారాణి, రుక్మిణి, జనరల్ కేటగిరి నుంచి డాక్టర్ ఎస్ వి ప్రసాద్, అంజిరెడ్డి, బి సీతారామయ్య, పీఏఎస్ఎన్ మూర్తి, ఆర్ శ్రీనివాసన్, తులసి దాసు గెలుపొందారు. వారితో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండగా.. డాక్టర్ ఎస్ వి ప్రసాద్ ప్యానల్ నుంచి ఆరుగురు, ఎన్ అంజిరెడ్డి ప్యానల్ నుంచి ఆరుగురు గెలుపొందారు. పూర్తిస్థాయి కమిటీని గురువారం ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.



ఘనంగా వీర సావర్కర్ జయంతి



వివేకానంద్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న హిందూ వాహిని నాయకులు

మోతీనగర్: అగ్నికణమై దేశభక్తిని రగిలించిన ధీరుడు వీర సావర్కర్ అని హిందూవాహిని కూకట్‌పల్లి బాగ్ కన్వీనర్ చందిప్ప శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ చౌరస్తాలో వీర సావర్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ హిందువాహిని అధ్యక్షుడు అభిషేక్, గణేష్, నాయకులు వెంకటరామిరెడ్డి, సుదర్శన్, నార్లపురం శ్రీనివాస్, మురళి సుదర్శన్, ఠాకూర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

ఆల్విన్‌కాలనీ: మురుగునీరు కిలోమీటర్ల మేర రోడ్లపై పారుతుంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూకట్‌పల్లి వెంకట్రావ్ నగర్ కమాన్ వద్ద సుమారు వారం రోజుల నుంచి మురుగునీరు పారుతూనే ఉన్నా జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీటిలో మురుగునీరు కలిసి ఇంటి ముందు, వాణిజ్య సముదాయాల ముందు ప్రవహిస్తుండటంతో వాహనదారులకు, పాదచారులకు అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



యువ వికాసం.. ఎందరికి ఆమోదం ?

- అర్హులకు జూన్ 2న సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం
- అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్న సంబంధిత అధికారులు
- యువ వికాసం కింద మంజూరైన యూనిట్లు 24,610
- అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 66,648

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం కింద అందించే రుణాల మంజూరుపై జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే యువ వికాసం దరఖాస్తులను వడపోసిన సంబంధిత అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. జూన్ 2న ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అర్హుల జాబితా రూపకల్పనపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలు మల్లగుల్లాలు పడుతున్నాయి. కులాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఇదివరకే పురపాలక సంఘాలు, మండల అధికారులు బ్యాంకర్లకు అందించారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, వివిధ రుణాలు ఏమైనా ఉన్నాయా.. అనే కోణంలో పరిశీలించిన బ్యాంకు అధికారులు సంబంధిత పత్రాలను పురపాలక సంఘాలు, మండల అధికారులకు పంపించారు. బ్యాంకర్లు అందించిన వాటిలో సిబిల్ స్కోర్ కలిగి, అర్హులున్న వారి వివరాలతో కూడిన తుది జాబితాను అధికార యంత్రాంగం సిద్ధం చేసి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి త్వరలో నివేదించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం గురువారం వరకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలనే ఆలోచనలో ఉన్నా.. ఆ దిశగా పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.

వర్గీకరణ ఆధారంగానే..

ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ఆ దిశగానే.. కులాల శాతం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ముందుగా ఎక్కువ శాతం రూ. 50 వేల ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

కార్పొరేషన్	దరఖాస్తులు	యూనిట్లు
ఎస్సీ	16,300	6,201
ఎస్టీ	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ	10,217	3,415

◆ రాజీవ్ యువవికాసానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీశాఖలకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 66,648 దరఖాస్తులు వచ్చాయి. వీటిని బ్యాంకుల వారీగా సిబిల్ స్కోర్ పరిశీలించేందుకు బ్యాంకర్లకు అందించారు. పరిశీలన అనంతరం బ్యాంకర్లు అందించిన వాటిలో అర్హుల జాబితాను పురపాలక సంఘాలు, మండల అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. జిల్లా మొత్తంగా 24,610 మంది లబ్ధిదారులకు సాయం అందించాలని సంబంధిత కార్పొరేషన్లకు ఆదేశాలు రావడంతో దీనికనుగుణంగానే జాబితాను తయారు చేస్తున్నారు.

◆ బ్యాంకులు సిబిల్ స్కోర్ పరిశీలనను ఇంకా పూర్తి చేయలేదని, బుధవారం నాటికి దాదాపు 50 శాతం మేర దరఖాస్తుల సిబిల్ స్కోర్ పరిశీలించిన అధికారులు పురపాలక సంఘాల అధికారులకు పత్రాలను అప్పగించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు స్థానికంగా నెలకొన్న రాజకీయ జోక్యం నేపథ్యంలో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

చెరువులో మురుగునీరు కలవకుండా కృషి



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్‌లో రూ.6 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సున్నం చెరువులో మురుగునీరు కలవకుండా లైన్ డైవర్షన్ కోసం నూతనంగా 450 మి.మి. డయా పైపులైన్ పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు మొగులయ్య, జావిదొద్దీన్, సాజీద్, కమల్ వాసన్, శ్రీనివాస్‌రావు, జితేందర్, యోగి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో విజయం తథ్యం

రాయదుర్గం: ప్రగతిశీల భారతదేశం కోసం మేధో సంపత్తిని పెంపొందించుకోవడానికి పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ జి కృష్ణవేణి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్ ప్రాంగణంలో 12వ తరగతిలో ప్రతిభ చాటిన వారికి 'ప్రతిభ సమ్మాన్.. సమారోహ్' పేరిట ఎఫ్‌డీడీఐ ,హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ లోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె విద్యార్థులను సన్మానించారు. సమాజం కోసం విద్యార్థులు, యువత తమవంతూ కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్,ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జైహింద్ యాత్ర సభ



జైహింద్ యాత్ర ర్యాలీ, సభ గురించి చర్చిస్తున్న టీపీసీసీ చీఫ్ తదితరులు

నిజాంపేట్: ఆపరేషన్ సిందూర్‌ని బీజేపీ రాజకీయాలకు వాడుకుంటుందని, భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలకు మౌనంగా ఉన్న ప్రధాని మోడీ తీరును ఎండగట్టేందుకు జైహింద్ యాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో జైహింద్ యాత్ర ర్యాలీ, సభ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గంలోని కేజీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఏఐసీసీ మాజీ సర్వీస్‌మెన్ కమిటీ చైర్మన్ కల్నల్ రోహిత్ చౌదరి పాల్గొంటున్నారని తెలిపారు. సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు సంపత్‌కుమార్, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు.





ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా వసంత్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు – కేపీహెచ్‌బీకాలనీ



వివేకానందనగర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు. – కేపీహెచ్‌బీకాలనీ

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



వివేకానందనగర్ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆయా డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ గేట్ నెంబర్ 2, వివేకానందనగర్ కాలనీ, కమల ప్రసన్న నగర్, మాధవరం నగర్ కాలనీ, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం కాలనీ నగర్ కాలనీ అప్రోచ్ రోడ్డు, రిక్షాపుల్లర్స్ కాలనీలో 1.37 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్‌లు రాగం నాగేందర్ యాదవ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అదే విధంగా వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద 1.90 కోట్ల అంచనా వ్యయంతో మాధవరం నగర్ కాలనీ హైటెన్షన్ లైన్ కింద నాలా కల్వర్టు బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్‌రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద బ్రిడ్జిని ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందన్నారు.

శేరిలింగంపల్లికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

- రూ.200 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే గాంధీ వెల్లడి



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త తెలిపిందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ బుధవారం తెలిపారు. శేరిలింగంపల్లిలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తం గా ప్రతిష్టాత్మ కంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడగగా నే వెంటనే శేరిలింగంపల్లిలో ఈ స్కూల్ ఏర్పాటుకు అంగీకరించడంతోపాటు రూ.200 కోట్లు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. ఆధునిక సదుపాయాలతో కూడిన ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ఒక మెట్రో స్థాయి వసతులతో కూడిన పాఠశాలలో చదివే అవకాశాన్ని పొందవచ్చన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి, ముఖ్యంగా మా నియోజకవర్గానికి రావడం గర్వంగా ఉందన్నారు. ఈ ఇంటిగ్రేటెడ స్కూల్ మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటుతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం నాణ్యమైన విద్యను పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇది నియోజకవర్గంలో భవిష్యత్తు తరాల విద్యాభివృద్ధికి బలమైన పునాది కానుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటుకు వెంటనే తగిన చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు.